క్లుప్తంగా

కొమ్మాదిలో ఆధార్ సేవలు



ఆధార్ సేవలు అందిస్తున్న సంతోష్

మధురవాడ : కొమ్మాది జంక్షన్ సమీపంలో బీఎస్ఎన్ఎల్ ఆఫీసు వద్ద ఆధార్ సేవలు అందిస్తున్నామని, అంతా సద్వినియోగం చేసుకోవాలని ఏఈ నాగరాజు చెప్పారు. ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేట్, బయోమెట్రిక్ అండ్ డెమోగ్రాఫిక్ అప్‌డేట్స్, ఫోన్ నంబర్, మెయిల్ ఐడీ లింక్ అప్, మార్పులు,చేర్పులు సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. కష్టమర్ సర్వీసు కేంద్రంలో ఉదయం 10గంటలు నుంచి సాయంత్రం 5గంటలు వరకు ఆఫీసు పనివేళల్లో ఈ సేవలు అందిస్తున్నామన్నారు.

ఉచితంగా హిందీ శిక్షణ తరగతులు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ ద్వారా సెప్టెంబర్ 9,10 తేదీల్లో జరుగు పరీక్షలకు సంబంధించి ఉచితంగా ఇవ్వనున్న శిక్షణా తరగతులకు ఆదర్శ హిందీ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు ఆహ్వానం పలుకుతున్నారు. ఈ శిక్షణ తరగతులు ప్రతి ఆదివారం, రెండో శనివారం, ఇతర సెలవు దినాలలో భీమిలిలో జరుగనున్నాయి. ఉదయం వేళ 8 నుంచి 12 వరకు లోయర్ పరీక్షలైన పరిచయ్, ప్రాథమిక, మాధ్యమ, రాష్ట్రభాష, ప్రవేశిక విద్యార్థులకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 వరకు హయ్యర్ పరీక్షలైన రాష్ట్రభాష విశారద పూర్వార్థ, రాష్ట్రభాష విశారద ఉత్తరార్థ, రాష్ట్రభాష ప్రవీణ పూర్వార్థ, రాష్ట్రభాష ప్రవీణ ఉత్తరార్థ పరీక్షలకు శిక్షణ ఇవ్వనున్నారు. వివరాలకు 89858 97419, 89856 47419 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రింగు వలలతో వేట వద్దు

తగరపువలస: రింగు వలలు, చిన్న కన్నులు కలిగిన వలలతో మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని గురువారం భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం, అన్నవరం పంచాయతీల్లో మత్స్యకార అసిస్టెంట్ యు.మహేష్ ఆధ్వర్యంలో అధికారులు అవగాహన కలిగించారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు తీరంలో రింగు వలలతో వేటను నిషేధించినట్టు చెప్పారు. భవిష్యత్తులో మత్స్యసంపద తగ్గిపోకుండా ఈ నిషేధం అమలు చేస్తున్న నేపథ్యంలో మత్స్యకారులంతా సహకరించాలని కోరారు.

పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా అప్పలనాయుడు



అప్పలనాయుడుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న సూపర్‌వైజర్ మహేష్

పద్మనాభం: మండలంలోని విలాస్కాన్‌పాలెం గ్రామ విశాఖ డెయిరీ పాల ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్షుడిగా బోని అప్పలనాయుడు గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులుగా పది మంది ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా ఎన్నికైన అప్పలనాయుడుకు నియామక పత్రాన్ని సూపర్ వైజన్ మహేష్ అందజేశారు.

జగనన్న సురక్ష పథకం అమలుపై అవగాహన

తగరపువలస: ఈ నెల 23న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిచే ప్రారంభం కానున్న జగనన్న సురక్ష పథకం అమలుపై వలంటీర్లు, వార్డు సచివాలయ కార్యదర్శులకు గురువారం సంతపేట వార్డు సచివాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమిలి జెడ్సీ బి.రాము మాట్లాడుతూ జోన్ పరిధిలో ఈ పథకంపై గ్రామ సచివాలయాల్లో ఈ నెల 24 నుంచి 30 వరకు ఇంటింటా సర్వే జరుగుతుందన్నారు. జోన్ కమిటీల పర్యవేక్షణలో సంక్షేమ పథకాలు పొందడానికి అర్హులైన లబ్ధిదారులను గుర్తించవలసి ఉందన్నారు.

జాతర బస్టాప్‌నకు దారేది..!



గ్రిల్స్ ఏర్పాటు చేయడంతో విద్యుత్ స్తంభం సందులోనుంచి రోడ్డు దాటుతున్న ప్రయాణికులు



హైవే పై మధురవాడ జాతర వద్ద ఏర్పాటు చేసిన గ్రిల్స్

- హైవే పై గ్రిల్స్ ఏర్పాటుతో దిక్కుతోచని స్థితి
- ప్రమాదకరంగా రోడ్డుదాటుతున్న స్థానికులు

మధురవాడ: ఎద్దుకు దూడ పుట్టింది అంటే తీసుకెళ్లి రాటకు కట్టేయ్ అన్నాడట ఒకరు..ఆ విధంగా ఉంది జాతీయ రహదారుల సంస్థ అధికారుల, పోలీసుల తీరు. అస్తవ్యస్త రోడ్డు క్రాసింగ్ వలన జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ఏసీఏ–వీడీసీఏ వైఎస్సార్ క్రికెట్ స్టేడియం నుంచి కొమ్మాది వరకు అధికారులు డివైడర్‌పై గ్రిల్స్ ఏర్పాటు పనులు చేపట్టారు. ఇంత వరకు బాగానే ఉంది. అయితే జాతర వద్ద మధురవాడ వైపు ఉన్న కార్‌షెడ్ బస్టాప్ నుంచి రోడ్డు దాటటానికి మాత్రం దారిలేకుండా గ్రిల్స్ వేసేశారు. దీంతో మిథిలాపురి వుడా కాలనీ, ఎన్‌జీజీవోస్ కాలనీ, చంద్రంపాలెం, పిలకవానిపాలెం, పాత పీఎంపాలెం, దుర్గానగర్, ఐటీ సెజ్ తదితర ప్రాంతాలకు వెళ్లే వారి పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. వీరు బస్సు దిగి రోడ్డు దాటాలన్నా, బస్ స్టాప్‌నకు వెళ్లాలన్నా.. ఇరువైపులా 100మీటర్లు పైనే హైవేపై నడచుకుని వెళ్లాల్సి వస్తోంది. సర్వీసు రోడ్డులో వెళదామంటే ఇటువైపు ఉన్న డివైడర్లు అడ్డు. తప్పని సరిగా హైవేపైనే నడవాల్సిన పరిస్థితి. దీంతో ఇక్కడ బస్సు దిగిన వారు, ప్రాణం అరచేత పట్టుకుని రోడ్డు దాటుతున్నారు. ఇక కొంత మంది యువత అయితే గ్రిల్స్ పై ఎక్కిదూకుతున్నారు. ఇవన్నీ ప్రమాదకర పరిస్థితులే. ప్రమాదాలు తగ్గించడానికి ఏర్పాటు చేసిన గ్రిల్స్ మరిన్ని ప్రమాదాలు తెచ్చి పెట్టేవిగా ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇక వృద్ధులు, మహిళలు పరిస్థితి మరింత దారుణం. ఇప్పటికైనా పోలీసు, హైవే, జీవీఎంసీ అధికాలు తక్షణమే స్పందించి బస్టాప్ వద్ద జీబ్రా లైన్స్, బస్టాప్ బోర్డు ఏర్పాటు చేసి, ప్రయాణికులు నడవడానికి దారి విడిచిపెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

దాహార్తి తీరుస్తున్న చలివేంద్రాలు



మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం

మధురవాడ: వేసవి తాపం నుంచి పాదచారులు, వాహనదారులకు దాహార్తి తీర్చి నీడ నిచ్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాలు, గ్రీన్ షెల్టర్లు ప్రజలకు ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయి. ఈ ఏడాది ఎన్నడూ చూడని ఎండలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వాహనదారులు, పాదచారులు గుక్కెడు నీటికి ఎన్నో వ్యయ ప్రయాసలు పడాల్సిన తరుణంలో జీవీఎంసీ ముందు చూపుతో ఏర్పాటు చేసిన చలివేంద్రాలు, గ్రీన్ షెల్టర్లుఉ ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయి. జీవీఎంసీ మధురవాడ జోన్–2 పరిధిలోని 5, 6, 7, 8, 9 వార్డుల్లో రూ.4.39లక్షలు వ్యయంతో 11 చోట్ల చలివేంద్రాలు ఐదు చోట్ల గ్రీన్ షెల్టర్లు జీవీఎంసీ ఏర్పాటు చేసింది.

10 చోట్ల చలివేంద్రాలు

అయా వార్డుల్లో మారికవలస, కొమ్మాది కూడలి, మధురవాడ రైతు బజార్, మధురవాడ జోనల్ కార్యాలయం, చంద్రంపాలెం, మిథిలాపురి వుడా కాలనీ, కార్ షెడ్ జంక్షన్, యండాడ జంక్షన్, సాగర్ నగర్, హనుమంతువాకలో చలివేంద్రాలు ప్రజలకు దాహార్తిని తీరుస్తున్నాయి.

గ్రీన్ షెల్టర్లు

మారికవలస, మధురవాడ రైతు బజార్, మధురవాడ జోనల్ ఆఫీసు, హనుమంతువాక తదితర చోట్ల గ్రీన్ షెల్టర్లు ఏర్పాటు చేశారు.

విద్యార్థికి అభినందన



సాయికి రూ.10 వేలు అందిస్తున్న డాక్టర్ రవిచరణ్

భీమునిపట్నం: సీబీఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాల వద్ద పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి సాయికి అపోలో ఆస్పత్రికి చెందిన పల్మనాలజిస్ట్ డాక్టర్ రవిచరణ్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన రూ.పదివేలు ప్రోత్సాహాన్ని అందించారు. సాయి ఇంటర్ చదువుకు పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పీ.జీ.కే. వర్మ, ఎన్.ఎస్.ఎం.రాజు సహకారిన్ని అందిస్తామని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ పీ.ఏ.విజయ కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం, కాపులదిబ్బడపాలెం, గంగడపాలెం ప్రాంతాలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు అన్నారు. జీవీఎంసీ నిధుల నుంచి రూ. 20 లక్షలతో కుళాయిలు ఏర్పాటు పనులను ఆయన ప్రారంభించారు. గత టీడీపీ పాలనలో ఇక్కడ మంచినీటి సమస్య పరిష్కరించమని స్థానికులు ఆందోళన చేసినా, అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఇటీవల జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇక్కడ మంచినీటి సమస్యను స్థానికులు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస్ దృష్టికి తీసుకుని రాగా వెంటనే సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు పనులు ప్రారంభమైనట్లు కొండబాబు తెలిపారు.

బంగారమ్మకు ప్రత్యేక పూజలు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ బంగారమ్మతల్లికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారాంతపు పూజల్లో భాగంగా అమ్మవారికి వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కూర్మావతారంలో జగన్నాథుడు



కూర్మావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

భీమునిపట్నం: ఇక్కడ జరుగుతున్న జగన్నాథ స్వామి రథోత్సవ మహోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు కూర్మావతారంలో భక్తులను దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఆర్.సింగరాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు, అలాగే ఆలయానికి వచ్చిన భక్తులకు ఈ అవతార విశిష్టతను వివరించారు.

మొక్కల ద్వారా పర్యావరణ పరిరక్షణ



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుధాకర్

భీమునిపట్నం: పర్యావరణం సక్రమంగా ఉండాలంటే తప్పని సరిగా మొక్కలను పెంచాలని జిల్లా డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎల్. సుధాకర్ అన్నారు. గురువారం ప్రపంచ వర్షారణ్యం దినోత్సవం సందర్భంగా నిర్వహించి కార్యక్రంలో మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో వాతావరణంలో జరుగుతున్న మార్పువల్ల వర్షపాతం తగ్గిపోవడంతోపాటు వేడి పెరుగుతోందన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే నీరు దొరకడం ఎంతో కష్టమవుతుందన్నారు. దీనివల్ల మానవ మనుగడతోపాటు, అన్ని జంతుజాలాల మనుగడకూడా ప్రశ్నార్థకంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితి మారాలంటే తప్పనిసరిగా అందరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు షేక్ అల్లావుద్దీన్, మహాలక్ష్మి, గొట్టేటి రవి, సోమయాజులు, మాధవి పాల్గొన్నారు.

అవ్వాతాతలకు కంటి వెలుగు

అంధత్వ నివారణకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. డాక్టర్ వైఎస్‌ఆర్ కంటి వెలుగు కార్యక్రమంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. పథకం ఇప్పుడు మంచి ఫలితాలు ఇస్తోంది. కంటి చూపు సమస్యతో బాధ పడుతున్న ఎంతో మంది వృద్ధులకు చూపు ప్రసాదిస్తోంది.



ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల

- వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా వృద్ధులకు నేత్ర పరీక్షలు
- జిల్లాలో 21,180 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తింపు
- 17,249 మందికి పంపిణీ

మహారాణిపేట : డాక్టర్ వైఎస్‌ఆర్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తుంది. శస్త్ర చికిత్సలు, కళ్లజోళ్లు, మందులు ఉచితంగా పంపిణీ చేస్తోంది.

వృద్ధులతో మొదలు

వృద్ధుల కంటి సమస్యలు మొదటి దశలోనే గుర్తించి చికిత్స చేస్తే సమస్య నుంచి బయటపడవచ్చు. ప్రత్యేక శిబిరాలు, ఆస్పత్రుల్లో కంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. తద్వారా కంటి సమస్యతో ఇబ్బంది పడుతున్న వారిని గుర్తిస్తున్నారు. ఇప్పటి వరకు మూడు విడతల్లో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో 60 సంవత్సరాలు పైబడిన అవ్వాతాతలు 2,18,446 మంది ఉన్నట్టు గుర్తించారు. వీరిలో 1,33,622 మందికి వైద్య పరీక్షలు చేశారు. 21,180 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించి, 17,249 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. మిగిలిన వారికి కూడా కళ్లద్దాలు సిద్ధం చేశారు. లబ్ధిదారులు వచ్చి కళ్లద్దాలు తీసుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. 7,776 మందికి కేటరాక్టు శస్త్ర చికిత్సలు అవసరంగా గుర్తించారు. వీరిలో 3394 మందికి శస్త్ర చికిత్సలు చేశారు. పలు ప్రైవేటు ఆస్పత్రుల సహకారంతో శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు.



వృద్ధులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

వృద్ధులకు పరీక్షలు



మూడు విడతల్లో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం కింద వృద్ధులందరికీ కంటి పరీక్షలు పూర్తి చేశాం. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అవ్వా–తాతలకు కళ్ల జోళ్లు ఇచ్చాం. కంటికి శస్త్ర చికిత్సలు కూడా చేస్తున్నాం. ఎన్‌జీవో సహకారంతో లబ్ధిదారులను గుర్తించే కార్యక్రమం జరుగుతోంది. ఈ కార్యక్రమం ఆగస్టు వరకు అమల్లో ఉంటుంది.

– డాక్టర్ జగదీశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

అవసరమైన వారికి శస్త్ర చికిత్స చేస్తున్నాం..



కంటి వెలుగు కార్యక్రమంలో అవ్వాతాతలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం, ఆస్పత్రికి వచ్చే వారికి కంటి వెలుగు కార్యక్రమం గురించి అవగాహన కల్పించడం చేస్తున్నాం. పరీక్షల అనంతరం అవసరం అయితే శస్త్ర చికిత్సలు చేస్తున్నాం. అలాగే కేటరాక్టు ఆపరేషన్లు కూడా చేస్తున్నాం.

– డాక్టర్ విశ్వమిత్ర, సూపరింటెండెంట్, ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రి

యథేచ్ఛగా మట్టి తరలింపు



తాటితూరు పెద్ద చెరువును ఆనుకుని డి పట్టా భూముల్లో యంత్రాలతో మట్టి తవ్వకాలు



పద్మనాభం మండలం సామియ్యవలస మీదుగా ఇటుక బట్టీలకు మట్టి తరలింపునకు మార్గం

తగరపువలస : భీమిలి మండలం తాటితూరు పంచాయతీలోని డి–పట్టాదారులకు చెందిన భూముల నుంచి ఇటుక బట్టీల యజమానులు యథేచ్ఛగా మట్టిని తరలించుకుపోతున్నారు. తాటితూరు పెద్ద చెరువును ఆనుకుని ఇదే పంచాయతీకి చెందిన 15 దళిత కుటుంబాలకు గతంలో ప్రభుత్వం డి పట్టా భూములు కేటాయించింది. ఈ భూములను ఆనుకుని మిగిలిన వారి భూములు కూడా ఉన్నాయి. ఈ చెరువు కింద భూములు కలిగిన సాగుదారులు, దళిత రైతులు వరి, మొక్కజొన్న, రాగులు, నువ్వులు తదితర పంటలు సాగుచేస్తుంటారు. ఈ భూములపై కన్నేసి తాటితూరు పంచాయతీ, పద్మనాభం, ఆనందపురం మండలం ఇటుక బట్టీల యజమానులు ఇటీవల యంత్రాలు, లారీలు వినియోగించి రాత్రి పగలు తేడా లేకుండా మట్టిని తవ్వేసి తరలించారు. గత ఏడాది కూడా ఈ భూములలో మట్టిని తరలించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ సామియ్యవలస మీదుగా ఇతర వ్యవసాయ భూముల మీద నుంచి మట్టిని తరలిస్తూ రోడ్లను పాడు చేస్తున్నారని సామియ్యవలస వాసులు వాపోతున్నారు. తాటితూరు పంచాయతీ వాసులు ఇటీవల భీమిలి తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా తాత్కాలికంగా మట్టి తరలింపులకు బ్రేకులు పడ్డాయి. కాగా భవిష్యత్తులో మట్టి తరలించకుండా చర్యలు తీసుకోవాలని ఇక్కడి డి పట్టా భూములు కలిగిన రైతులు, ఇతర రైతులు కోరుతున్నారు.

యువతే దేశానికి సంపద



క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న నెహ్రూ యువ కేంద్రం జిల్లా సమన్వయ అధికారి మహేశ్వరరావు

పద్మనాభం : యువతే దేశానికి సంపదని నెహ్రూ యువ కేంద్రం జిల్లా సమన్వయ అధికారి జి.మహేశ్వరరావు అన్నారు. మండలంలోని కురపల్లిలో గురువారం నెహ్రూ యువ కేంద్రం, గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమి, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్టు, ప్రకృతి చికిత్సాలయం సంయుక్తంగా యువతకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేశ్వరరావు మాట్లాడుతూ యువత విద్య, క్రీడలు, సాంకేతిక రంగాల్లో రాణించాలన్నారు. దీనిలో భాగంగా కురపల్లి, రేవిడి, రౌతులపాలెం, తునివలస, రెడ్డిపల్లి గ్రామాలకు చెందిన యువతకు వాలీబాల్, ఫుట్‌బాల్, షటిల్, క్యారం బోర్డు వంటి క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. 1985 కామన్‌వెల్త్ క్రీడల్లో వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో బంగారు పతకం సాధించిన ఎంవీ మాణిక్యం, జాతీయ స్థాయిలో వంద, రెండు వందల మీటర్ల పరుగు పందంలో పతకాలు సాధించిన ప్రభుదాస్, దేశ విదేశాలలో 50, వంద మీటర్లు హడల్స్‌లో నందు, లాంగ్, హై జంప్‌లలో బంగారు పతకం సాధించిన ఎస్.శ్రీలక్ష్మి, భారతదేశం తరఫున ప్యారిస్‌లో జరిగిన క్రీడల్లో బంగారు పతకం సాధించిన కుమారి యామినిలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ మానవ సేవా జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్, రంగస్థల కళాకుల సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షుడు ఉప్పాడ అప్పారావు, ఆర్.శ్రీనివాసరావు, పి.కృష్ణారావు పాల్గొన్నారు.

వాహనాలు అదుపుతప్పుతున్నాయ్



బోల్తా పడిన వాహనదారుడు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు బంగ్లామెట్టపై తరచూ ద్విచక్రవాహనదారులు బోల్తాపడుతున్నారు. గతంలో బంగ్లామెట్ట నుంచి జాతీయరహదారి వైపు ఏటవాలుగా దారి ఉండేది. దీంతో ద్విచక్రవాహనదారులంతా ఈ మార్గం ద్వారానే రాకపోకలు సాగించేవారు. మూడేళ్ల క్రితం జాతీయరహదారుల విస్తరణ సమయంలో బంగ్లామెట్ట దారిని కుదించేశారు. దీంతో సర్వీస్‌రోడ్డు నుంచి బంగ్లామెట్టపైకి మార్గం వాలు ఎక్కువగా ఉండటంతో ఇరువైపుల నుంచి రాకపోకలు సాగించేవారు బోల్తాపడి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా ప్రమాదకరంగా ఉన్న ఈ మార్గాన్ని వాహనాల రాకపోకలకు అనువుగా జీవీఎంసీ అధికారులు రూపొందించాలని బంగ్లామెట్ట వాసులు కోరుతున్నారు.

పుస్తెలతాడు చోరీపై ఫిర్యాదు

తగరపువలస: పుస్తెలతాడు చోరీపై భీమిలి పోలీసులకు ఫిర్యాదు అందింది. భీమిలి మండలం తాటితూరు పంచయతీ శివాలయం వీధిలో తన తల్లి నివాసముంటున్న ఇంట్లో ఈ నెల 19న రాత్రి దొంగలు పడి పుస్తెలు తాడు చోరీ చేశారని వంక అప్పలస్వామి ఫిర్యాదు చేశారు. దీంతో భీమిలి క్రైం హెడ్ కానిస్టేబుల్ పి.సుజాత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూడిక తొలగిస్తూ.. పైప్‌లైన్ తవ్వేశారు



చిట్టివలస పెద్ద చెరువు వద్ద పగిలిన పైప్‌లైన్

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ తగరపువలస, చిట్టివలస పరిధిలో మూడురోజులుగా డ్రైనేజీలలో పూడికతీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా జేసీబీలు, యంత్రాలు, లారీలు ఉపయోగించి తొలగించిన పూడికను తరలిస్తున్నారు. భీమిలి రోడ్డులో చిట్టివలస పెద్ద చెరువును ఆనుకుని డ్రైనేజీలలో పూడిక తొలగిస్తుండగా చిల్లపేట, జీరుపేట, రాయప్పాలెం తదితర గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే పైపులైన్‌కు జేసీబీ తగులుకుని రెండు చోట్ల పగిలిపోయాయి. 30 ఏళ్ల క్రితం ఆరడుగుల లోతులో వేసిన సిమెంట్ పైపులైన్ పగిలిపోవడంతో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయడానికి తాగునీటి సరఫరా విభాగ ఇంజినీరింగ్ సిబ్బంది సమాయత్తమవుతున్నారు. తాత్కాలికంగా పై గ్రామాలకు టాంకర్ల ద్వారా సాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఇదిలా ఉండగా కొండపేట పంప్‌హౌస్ వద్ద సిమెంట్ రోడ్డుపై మళ్లీ పైపులైన్ పగిలిపోవడంతో భీమిలికి సరఫరా అయ్యే తాగునీరు మళ్లీ వృథాగా పోయి ఈ ప్రాంతం చెరువును తలపిస్తోంది.

భగీరథ రిజర్వాయర్‌లో బురద తొలగింపు

ఇదిలా ఉండగా ఇటీవల భీమిలి జోన్‌లో సరఫరా అయ్యే తాగునీరు బురదగా ఉంటుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి కారణంగా వేంకటేశ్వరమెట్టపై ఉన్న భగీరథ రిజర్వాయర్‌లో పేరుకుపోయిన బురదే కారణమని తెలుస్తోంది. బుధవారం రాత్రితో రిజర్వాయర్ నుంచి పూర్తిగా బురదను తొలగించారు. పాక్షికంగా శిథిలమైన రిజర్వాయర్‌కు ఇటీవల మరమ్మతులు కూడా నిర్వహించారు.

ముగిసిన యోగా వేడుకలు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాలలో మూడురోజులుగా జరిగిన యోగా దినోత్సవ వేడుకలు గురువారంతో ముగిశాయి. యోగా శిక్షకురాలు కె.లలిత రాజేశ్వరి, యోగా గురువులు కె.శ్రీనివాసరావు, ఎం.వెంకటరమణ విద్యార్థులకు వివిధ ఆసనాలు వాటి ప్రాముఖ్యతను వివరించారు. ప్రాణాయామం, జ్ఞానంలపై అవగాహన కలిగించారు.ఈ ముగింపు కార్యక్రమంలో రఘు విద్యా సంస్థలకు చెందిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

బి.ఆర్.తాళ్లవలస సచివాలయం తనిఖీ

పద్మనాభం: మండలంలోని బి.ఆర్.తాళ్లవలస సచివాలయాన్ని గురువారం ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ తనిఖీ చేశారు. సచివాలయంలో హాజరుపట్టీ, లీవ్స్, తీర్మానం, మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. రికార్డులు అపడేటెడ్‌గా ఉంచాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. విధి నిర్వహణలో అందరూ అంకితభావంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు.